క్లుప్తంగా

స్పందనకు ఎనిమిది అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. ప్రతి వారం నిర్వహించే స్పందనలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఈ వారం ఎనిమిది అర్జీలు అందినట్టు సోమవారం ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి పరిష్కరించేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు భూమి రీ సర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మార్చాలని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి ప్రీతికరమైన సోమవారం కావడంతో తెల్లవారు జామున స్వామి వారికి అభిషేకాలు చేశారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఈఓ డి. నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, చందలాడ వెంకట్రావు, కర్రి వెంకట లక్ష్మి, చల్లా కుమారి, ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

వేలం పాట వాయిదా



ఆర్వో శాస్త్రి

కొత్తపల్లి: ప్రభుత్వానికి సంబంధించి నిర్వహించే వేలం పాట ప్రజలందరికీ తెలిసే విధంగా టాంటాం తప్పని సరిగా వేయించాలని జిల్లా పంచాయతీ కార్యాలయ రెవెన్యూ అధికారి శాస్త్రి అన్నారు. మండలంలోని నాగులాపల్లి పంచాయతీ కార్యాలయంలో సోమవారం వాక తిప్ప శివారున ఉన్న నాగులాపల్లి ఏరియా రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి ఉన్న ఫల సాయంపై పాట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే ముందస్తుగా ప్రజలకు సమాచారం తెలియపరచకపోవడం, టాంటాం వేయించకపోవడంతో ఆర్వో శాస్త్రి వేలంపాటను వాయిదా వేశారు. పాట నిర్వహణపై మండల పరిషత్ కార్యాలయంలో నోటీస్ బోర్డులో ప్రదర్శించకపోవడం, టాంటాం వేయకపోవడం అధికారుల నిర్లక్ష్యమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా మరిడమ్మ గరగ ఉత్సవం



ఆలయం వద్ద గరగ నృత్యం

పెద్దాపురం: స్థానికంగా కొలువైన మరిడమ్మ వారి గరగ ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా అమ్మవారు పుట్టింటికి వెళ్లి వచ్చుటకు గాను ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో గరగలను తీశారు. ఆలయం వద్ద గరగ నాట్యం అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో గరగల ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నగదు డిమాండ్‌పై కేసు నమోదు

తుని: స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన ఇద్దరు అమ్మాయిల ఫొటోలు మార్ఫింగ్ చేసి రూ.20 వేలు నగదు ఇవ్వాలని డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై సతీష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..ఇన్‌స్టాగ్రాంలో ఫొటోలు సేకరించిన అజ్ఞాత వ్యక్తి ఈ నెల ఆరు నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

చరిత్రను మలుపు తిప్పిన జగన్ పాదయాత్ర



పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న దవులూరి దొరబాబు



ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో దివంగత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు
- జగన్ పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర చరిత్రను మలుపు తిప్పిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ప్రజా నేత పాదయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ సెంటర్లో దొరబాబు భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ వేలాది మైళ్ల పాదయాత్ర చేసి, కోట్లాది ప్రజలను కలిసి వారి వ్యథలను తెలుసుకున్నారన్నారు. ముఖ్య మంత్రి అయ్యాక అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల కన్నీళ్లు తుడిచారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఏఎంసీ వైస్ ఛైర్మన్ బందారు వీరబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, కనపర్తి చీమదొర, బోనాసు గుర్రాజు, గోలి రామారావు, వాసంశెట్టి గంగ పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యాత్రకు నాలుగేళ్లు పూర్తి

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చొక్కా సింగన్న, బొందు రాంబాబు, గోరిసే కాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాగులాపల్లిలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహానికి ఎంపీటీసీ అనిశెట్టి సుభాషిణి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్యాకేజీ కోసమే బాబును కలిశారేమో?

- చంద్రబాబు, పవన్‌పై ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆగ్రహం



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: పవన్ కల్యాణ్ ప్యాకేజీ స్టార్ అని ఏదో ప్యాకేజీ మాట్లాడుకోవడానికే చంద్రబాబునాయుడిని కలిసి ఉంటారని చంద్రబాబు, పవన్ భేటీని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ ఇప్పటంలో ఇంటి గోడలు పడగొడితే తొడగొట్టి గగ్గోలు చేసిన పవన్ కల్యాణ్ చంద్రబాబు సభలో జనం చనిపోతే నోరెందుకు మెదపలేదో చెప్పాలన్నారు. ప్రజల ప్రాణాల కంటే ప్యాకేజీలే ముద్దు కాబట్టి చంద్రబాబు సభల పేరుతో జనం ప్రాణాలు తీస్తుంటే కనీసం ప్రశ్నించకుండా ఇద్దరు కలిసి ఇంట్లో ప్యాకేజీలు మాట్లాడుకుంటున్నారని విమర్శించారు. నాలుగు సినిమా డైలాగులు చెప్పి జనాన్ని మోసం చేసినంత మాత్రాన సినిమాల్లోలా జనంలో హీరోలు కాలేరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం: పిఠాపురం అగ్రహారంలో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి క్రయవిక్రయాలు జరుపుతున్నారని దానిపై విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం పిఠాపురం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కోనేటి రాజు, కుంచే చిన్న, జి.వీరబాబు తదితరులు మాట్లాడుతూ అగ్రహారంలో ప్రభుత్వ భూమికి కొందరు బహిరంగంగా విక్రయించారని, అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ తతంగంపై విచారణ జరిపి ప్రభుత్వ భూమిని విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఆ భూమిని స్వాధీనం చేసుకుని రక్షణ ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేశారు.

దళిత యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలి



దళిత యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ధర్నా చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: పెద్దాపురం మండలం పాలిమేరు గ్రామానికి చెందిన దళిత యువకుడు హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించి కేసును మూసి వేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ సంఘటనపై రీ పోస్టు మార్టం నిర్వహించి, విచారణ చేపట్టాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవార కాకినాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రమేష్ మాట్లాడుతూ పెద్దాపురం మండలం పాలిమేర గ్రామానికి చెందిన దళిత యువకుడు ఏనుగుపల్లి అప్పన్న నవంబర్ 29న పిఠాపురం మండలం విరవ గ్రామం పరిధిలోని పీహెచ్‌సీ కాలనీలో హత్యకు గురయ్యాడన్నారు. దీనిపై ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని వివరించారు. దీనిపై జిల్లా ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకొని, హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి, రీ పోస్టుమార్టం నిర్వహించి, దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం కన్వీనర్ వడ్లమూరి మంగాదేవి, నాయకులు కె సతీష్, పప్పు దుర్గారమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రం తనిఖీ



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గండేపల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఈఓపీఆర్డీ వీఎస్ఎన్ మూర్తి ఆదేశించారు. మండలంలోని రామయ్యపాలెం వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చెత్త నుంచి సంపద తయారీకి అవసరమైన చెత్తతో పాటు గ్రామాల పరిశుభ్రత కోసం గాజు, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు. వీటిలో వర్మీ కంపోస్టు తయారీకి అవసరమైన వాటిని ఉపయోగించి మిగిలిన వాటిని విక్రయించి సొమ్ములను పంచాయతీ నిధులకు జమ చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామచార్యులు, లోవరాజు, మైలవరపు బుజ్జి, తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ



పెద్దాపురంలో వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న విద్యార్థులు

గండేపల్లి: విద్యార్థులు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ విద్యార్థులు సోమవారం పెద్దాపురంలోని 'మన ఇల్లు' వృద్ధాశ్రమానికి నిత్యవసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.గోవర్ధన్‌రెడ్డి, కళాశాల అధ్యాపకు లు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చింపేశారంటూ పోలీసులకు ఫిర్యాదు

పిఠాపురం: పిఠాపురం పట్టణంలోని కోటగుమ్మం సెంటర్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ నేతలకు చెందిన ఫ్లెక్సీలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై ఆ పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ కొత్తపల్లి పద్మ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చింపేయడంతో సోమవారం పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం విషయాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు సూచించారు.

ఉపాధి పనుల తనిఖీ



చెందుర్తిలో ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కూలీలతో మాట్లాడి వేతనాలు సక్రమంగా అందుతున్నాయా?, సౌకర్యాలు కల్పించారా? లేదా? అనే విషయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో రైతులకు , స్థానికులకు ఉపయోగపడే పనులు చేయించాలని ఆమె ఉపాధి సిబ్బందికి సూచించారు. మస్టర్లు తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. మస్టర్లలో ఉన్న వాటికి, పనులు చేస్తున్న కూలీలకు తేడాలున్నాయనే విషయంపై ఆరా తీశారు. ఆమె వెంట పలువురు ఉపాధి సిబ్బంది ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ సుభద్ర



గొల్లప్రోలు స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ సుభద్ర

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో ఉన్న ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాలను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారిణి సుభద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె తరగతిలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి విద్యాభ్యాసం ఎలా జరుగుతుందన్న విషయాన్ని తెలుసుకున్నారు. సిలబస్ ఎంత వరకు పూర్తయింది, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ వంటి విషయాలను ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సూచనలు చేశారు.

జిమ్నాస్టిక్ పోటీల్లో పల్లవికి మొదటి స్థానం



జిమ్నాస్టిక్ పోటీల్లో ప్రథమ బహుమతి అందుకున్న పల్లవి

పెద్దాపురం: అండర్–8 రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్ లీగ్– 2023 పోటీల్లో పెద్దాపురం మండలంలోని ఆర్‌బీ పట్నం విద్యార్థిని పల్లవి ఉత్తమ ప్రతిభ కనబరిచి, ప్రథమ స్థానం సాధించింది. విశాఖపట్నంలోని స్పోర్ట్స్ అథారిటీ హాల్లో ఈ పోటీలు జరిగాయి. ఐఏఎస్ అధికారి కె.శారదాదేవి చేతుల మీదుగా పల్లవి బహుమతి అందుకుంది. ప్రతిభ కనబరిచిన పల్లవిని పలువురు అభినందించారు.

హామీలు అమలు చేసిన ఏకైక నేత జగన్



పీబీ దేవం గడప గడపకూ మన ప్రభుత్వంలో యువకుడితో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

- పీబీ దేవంలో ప్రజా సంకల్పయాత్ర వేడుకలు
- గడప గడపకూ నిర్వహించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను, హామీ ఇవ్వని అనేక పథకాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లయిన సందర్భంగా పీబీ దేవం గ్రామంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మలకల సత్య, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, డాక్టరు వైబీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో దవులూరి దొరబాబు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 32 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. తాను నియోజకవర్గంలో పర్యటిస్తున్నపుడు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మరో పర్యాయం దీవించాలని ప్రజలను కోరారు. అనంతరం పీబీదేవం గ్రామంలోని రెండో సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.

పాలనపై ప్రజాభిప్రాయానికే..

గత మూడున్నరేళ్ల రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి సలహాలు స్వీకరించడానికే రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని దవులూరి దొరబాబు అన్నారు. గడప గడపకు తిరిగిన సమయంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకే ఈ కార్య క్రమంలో అధికారులను కూడా భాగస్వామ్యులను చేశామన్నారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే అధికారులతో సమన్వయం చేసుకొని వారికి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీ అధ్యక్షులు మలకల వరహాలబాబు, వీరంరెడ్డి నాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు రెడ్నం దొరబాబు, పెండ్యాల అబ్బు, నాగనబోయిన రాజబాబు, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం



లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం 9, 15, 16 వార్డుల్లో ఆయన సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లబ్ధి పొందని కుటుంబమంటూ లేకుండా అన్ని వర్గాలకు వర్తించేలా సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతి పక్షాలు తప్పుడు ఆరోపణలకు దిగుతున్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందని ఇల్లంటూ ఏది కనిపించడం లేదని ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. పార్టీలతో పని లేకుండా టీడీపీ వారికి కూడా పథకాలు ఇచ్చే మంచి మనసున్న సీఎం ప్రజలకు దొరకడం తమ అదృష్టంగా ప్రజలు భావిస్తున్నారన్నారు. ఎవరెన్ని చెప్పినా ప్రజలు సీఎం జగన్ పక్షానే ఉంటారని ఆయన చెప్పారు. అనంతరం ఆయన స్థానిక వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి ప్రజల వినతులు ఎలా పరిష్కారమవుతున్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో గాయపడిన కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో నలుగురు కార్మికులు గాయపడ్డారు. సీఐ కె.దుర్గాప్రసాద్ కథనం ప్రకారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన రోడ్డు గోతులతో ఉండడంతో ఆర్ అండ్ బీ కార్మికులు మరమ్మతులు చేస్తున్నారు. ఇంతలో రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళుతున్న మినీ వ్యాన్ రోడ్డు మార్జిన్‌లో రాళ్లు సేరిస్తున్న కార్మికులను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గొల్లప్రోలుకు చెందిన బర్రే చంద్రరావు, ఉప్పాడ సత్తిబాబు, గుర్రాల అబ్బాయి, మక్క లాజర్ అనే కార్మికులు గాయపడ్డారు. ఇద్దరు స్వల్పంగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్వల్పంగా గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి, తీవ్రంగా గాయపడిన వారిని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలిసి సీఐ దుర్గాప్రసాద్, ఏఎస్సై రత్నం ఘటనా ప్రదేశానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎస్సై సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీలకు అదనపు ఆదాయం



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రభాకర రామారావు

కొత్తపల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని ఎంపీడీఓ నండూరి ప్రభాకర రామారావు అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తున్నామన్నారు. కొత్తపల్లి కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న యంత్రాలకు మరమ్మతులు నిర్వహించి పూర్తి స్థాయిలో పని చేసేలా చూస్తామని చెప్పారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ భాస్కరరావు ఉన్నారు.

డ్రోన్ సాయంతో భూముల రీసర్వే



తుని పట్టణంలో డ్రోన్ సహాయంతో భూముల రీసర్వే చేస్తున్న అధికారులు

తుని: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా పట్టణంలో నిర్వహించే రీసర్వేకు డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో డ్రోన్ పనితీరును సోమవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికే అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు ప్రత్యేక బృందం పట్టణ పరిధిలోని నివాసగృహాలు, ఖాళీస్థలాలు, ప్రభుత్వ స్థలాలు తదితర వాటి సమాచారాన్ని డ్రోన్ ద్వారా సేకరిస్తుందని చెప్పారు. ఈ సర్వేతో పట్టణానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారి ప్రవీణ్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తుని పట్టణంలో పందుల పెంపకం నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరాజు

తుని: ప్రజారోగ్యం దృష్ట్యా పట్టణంలో పందుల పెంపకం చేయవద్దని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పందుల పెంపకందారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో పందుల పెంపకం కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి పట్టణంలో పందులు పెంచితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాఆరోగ్యశాఖ అధికారి శేఖర్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.